

# రాక్షసుడు

"అయ్యో! ఏమిటమ్మా యిది? ఈ దెబ్బలేమిటి?" ఆదుర్దాగా అడిగింది శ్రుతి.

"అటక యెక్కబోయి జారి పడిపోయాను" బలవంతాన బాధను ఓర్చుకుంటూ

జవాబిచ్చింది సావిత్రి. రక్తాన్ని దూదితో తుడుస్తూ, పరిశీలనగా గాయాల్ని చూస్తూ ఆలోచిస్తోంది శ్రుతి.

వారం క్రితం భర్తను వెంటబెట్టుకొచ్చిన సావిత్రి గుర్తుకొచ్చింది. రోజారంగు చెక్కిళ్ళు, చిరుసిగ్గుతో వాలిపోతున్న కళ్ళు, చూడగానే ఆకర్షిస్తున్న అలంకరణ, కాసేపు మాట్లాడుతూ కూర్చున్నారు.

సావిత్రి భర్త సోమేశ్వరరావు పదేళ్ళనుంచీ కువైట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్ళయి ఎనిమిదేళ్ళయింది. ఇద్దరు పిల్లలు. సంవత్సరానికోసారి రెండు నెలలు సెలవు తీసుకుని వస్తూ ఉంటాడు.

"సావిత్రినీ పిల్లల్నీ అక్కడికి తీసుకెళ్ళిపోవచ్చు కదా మీరు? ఏళ్ళ తరబడి యిలా విడిగా వుండడం కష్టంకాదూ?'' మాటల మధ్యలో అతన్ని అడిగింది శ్రుతి. అంతవరకూ నవ్వుతూ మాట్లాడుతున్న అతని కళ్ళల్లో విషాదం సుళ్ళు తిరిగింది.

"ఎందుకు కష్టంగా లేదూ? ఒకోసారి వెధవ ఉద్యోగాన్ని విడిచిపెట్టి పరిగెత్తుకు పారిపోయి రావాలనిపిస్తుంది. బాగా తిరుగుతున్నప్పుడు ఫరవాలేదు. కొంచెం ఒంట్లో బాగాలేకపోతే చాలు, యింక జబ్బు తగ్గనే తగ్గదేమో, అక్కడే దిక్కూ మొక్కూ లేకుండా చనిపోతానేమో, నా వాళ్ళనింక చూడలేనేమోనని అధైర్యం కలుగుతుంది. నా పక్కలు వెచ్చబడితే చాలు. అగ్గగ్గలాడిపోయే అమ్మను తలచుకుంటే ఏడుపు ముంచుకొస్తుంది. సావిత్రి, పిల్లలు కళ్ళముందు మెదిలితే చాలు. రెక్కలు కట్టుకుని ఎగిరి రావాలనిపిస్తుంది. కాని... రాలేను. ఉద్యోగాన్ని విడిచిపెట్టనూ లేను. వచ్చి యిక్కడ కూలి చేసుకుని బ్రతకనూ లేను. యిక్కడే పనిలోనూ నిలదొక్కుకోలేకే, అవకాశం కలిసొచ్చి అక్కడకు వెళ్ళాను. మంచో, చెడో ఒక రకమైన బ్రతుక్కి అలవాటు పడిపోయాను. నా భార్య, పిల్లలు, అమ్మ, తమ్ముడు లోటులేకుండా బ్రతకగలిగినంత పంప గలుగుతున్నాను. యింత మందినీ అక్కడికి తీసుకెళ్ళి పోషించలేను. కొద్దో, గొప్పో వెనకేసి, కూడపెట్టుకు వచ్చి యిక్కడేదన్నా వ్యాపారం చేసుకు బ్రతకాలని నా తాపత్రయం. అప్పటిదాకా ఈ బాధ, ఎడబాటు తప్పవు.'' సుఖజీవనం కోసం పోరాటం, పట్టుదల, అధైర్యం, సంఘర్షణ, త్యాగాలు, కన్నీళ్ళు - ఆసక్తిగా వాళ్ళని గమనించింది శ్రుతి. అదంతా కళ్ళముందు కదిలింది.

"రోజూ ఇంజక్షన్‌కి వస్తావా? క్యాప్సూల్స్ రాసివ్వనా?'' టెటనస్ టాక్సాయిడ్ ఇంజక్ట్ చేస్తూ సావిత్రిని అడిగింది శ్రుతి.

"ఇంజక్షన్ చేయించుకుంటానమ్మా! త్వరగా మానాలి." భర్త వున్న నాలుగు రోజులు ఆరోగ్యంగా వుండక యిలా జరిగిందన్న వ్యథ కదిలింది సావిత్రి కళ్ళల్లో.

మరునాడు సావిత్రి వెంట ఆమె భర్తకూడా వచ్చాడు. గాయాలు తగిలినచోట డ్రెసింగ్ చేసి, ఇంజక్షనిచ్చాక సావిత్రిని బయట కూర్చోబెట్టి అతను శ్రుతి రూమ్‌లోకి వచ్చాడు.

"ఫరవాలేదు కదా డాక్టర్‌గారూ?!" భయంగా అడిగాడతను.

"ఏం ఫరవాలేదు! రెండు రోజుల్లో బాగా తగ్గిపోతాయి" ధైర్యం చెప్పింది శ్రుతి.

ఒక నిమిషం తలవంచుకుని మౌనంగా కూర్చున్నాడతను.

"నన్ను పరీక్షచేసి మంచి మందివ్వాలి డాక్టర్!" గిల్టీగా చూస్తూ అన్నాడతను.

"మిమ్మల్నా?!" ఆరోగ్యంగా కనిపిస్తున్న అతనివంక విస్మయంగా చూస్తూ అడిగింది శ్రుతి. అంతలోనే అతని కళ్ళల్లో పలుచటి నీటిపొర కమ్మింది. ఒక నిమిషంలో తమాయించుకున్నాడు.

"సావిత్రి పడిపోలేదు. నేను కొట్టాను" ఆశ్చర్యంగా అతని వంక చూస్తూంది శ్రుతి. భార్యను అపురూపంగా చూసుకునే యితనా అంత దారుణంగా కొట్టింది? ఏ పరిస్థితుల్లో, ఏ భావోద్రేకంలో అతనా పనిచేశాడు?!"

"నిజమే. నేనే కొట్టానండి. సావిత్రి నా ప్రాణం. కాని... కాని... నేను ఊహించుకునే దంతా అబద్ధమే, సావిత్రి నిప్పు అంటుంది. అమ్మ... సడన్‌గా నాలో అనుమానపు భూతం లేస్తుంది. నేనిక్కడ లేని సమయంలో సావిత్రి ఎవరితోనైనా..... ఛీ! ఛీ! మామూలుగా సావిత్రి గురించి యిలా అనుకుంటానికే అసహ్యం. నాలో రాక్షసుడు బయటి కొచ్చినప్పుడు యిదేమీ గుర్తుకు రాదు. సావిత్రిని కొట్టి, తిట్టి హింసించడం ఆ రాక్షసుడికి ఆనందం" మాటలు పేర్చుకుంటూ, దీనంగా తన గురించి చెప్పుకుంటున్న అతనివంక జాలిగా చూసింది శ్రుతి.